# రెల్లు

హైదరాబాదు నుంచి మా ఊరు బస్సులో ఎనిమిదిన్నర గంటల ప్రయాణం. ట్రెయిన్లు వేయడంలో మా గిరిజన ప్రాంతాలను చిన్నచూపే చూస్తుంటారు. అధికారులు తొక్కేస్తుంటున్నా మా నాయకులు పట్టించుకున్నట్లు కనిపించదు. దోపిడిలో వాళ్ళూ భాగస్వాములా? అనిపిస్తూంటుంది.

మా ఊరు ఎంతో పెద్ద అడవికి మొదట్లో ఉంది. ఇంకా లోపలికి వెళితే చాలా తండాలున్నాయని దొడ్డమ్మ చెప్పింది కాని నేనెప్పుడూ అడవిలోకి వెళ్ళలేదు. నా చిన్నప్పుడు అన్నలతోనూ, పోలీసులతోనూ

ఆ ప్రాంతమంతా హడావిడిగా ఉండేది. ఎవరు అన్నలో, ఎవరు పోలీసులో తెలుసుకోవడం కష్టమయ్యేది. మా వాళ్ళు చాలామంది వాళ్ళకూ వీళ్ళకూ బలయిపోయారు. పదోతరగతి పూర్తిచేశాక పై చదువులకు మా ఊరు నుండి హైదరాబాద్ వెళ్ళిపోవడం అది ముఖ్య కారణం. హైదరాబాద్‌లో నాన్న మింట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. పెద్ద ఉద్యోగమేమి కాదు.

ఎప్పటినుండో అనుకుంటూ ఉంటే చివరకు ఆ వేళ మా ఊరు రావడానికి వీలుపడింది. మా ఊరుని అందరితో ఎంతో గొప్పగా చెప్పుకుంటుంటాను కాని నిజానికి మా ఊరు కాదు అది. నేను అక్కడ చదువుకున్నాను. దొడ్డమ్మ దగ్గర పెరిగాను.

ముసుపటిలా ఇప్పుడు మా ఊళ్ళో గొడవలు లేవు. పూర్తిగా తగ్గిపోయాయి. ఎనిమిదేళ్ళలో ఊరు ఒక మోస్తరుగా మారిపోయింది. దొడ్డమ్మ, పెద్దనాన్న బాగానే ఉన్నారు. ఎనిమిదేళ్ళ కిందట ఎలా ఉండేవాళ్ళో ఇప్పుడూ అలాగే ఉన్నారు. నేను ఇంటికి చేరకున్నప్పటి నుండి దొడ్డమ్మ కబుర్లు చెబుతూనే ఉంది. నా రాక ఆమెకు ఎంతో సంతోషంగా ఉంది. ఊరు గురించి చెప్పింది. మా బంధువుల గురించి వివరించింది. దొడ్డమ్మ ప్రేమ కలది. ఒకసారి సంభాషణ మొదలెట్టిందంటే ఆపదు. పెద్దనాన్న ఎక్కువగా మాట్లాడడు. ఎప్పుడో కాని ఇల్లు దాటి బయటకు వెళ్ళడు. అరుగు మీదున్న పక్కమీద కాలు మీద కాలు వేసుకుని కూర్చుని చుట్ట తాగుతూ అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటాడు. ఆయన చేబ్రోలు పుగాకు అంటే చాలా ఇష్టపడతాడు. రోజుకు నాలుగయిదు చుట్టలు ఒక్కసారి కాకుండా వాయిదా పద్ధతుల్లో లాగిస్తూ ఉంటాడు.

భోజనాలయ్యాక నేను చేయి కడుక్కుని వచ్చి దొడ్డమ్మకు ఎదురుగా గోడకు ఆనుకుని నేల మీద కూర్చున్నాను. దొడ్డమ్మ కాళ్ళు బార్లా చాపుకుని కూర్చుంది. పెద్దనాన్న వరండాలో కూర్చుని చుట్ట లాగిస్తున్నాడు. నేను అడగకుండానే దొడ్డమ్మ శంభు, శివ, లింగ, నాయక్‌లు గురించి చెప్పడం మొదలుపెట్టింది. మేమంతా కలిసి చదువుకున్నాం. వాళ్ళు మా ఇంటికి ఎప్పుడు వచ్చినా దొడ్డమ్మ తినడానికి ఏదయినా చేసి పెడుతుండేది. ఆమెకు పిల్లలంటే ఇష్టం. ఆమెకు పిల్లలు లేరు. నన్ను పెంపకానికి తీసుకుందామనుకుంది. కాని అమ్మ ఒప్పుకోలేదు.

వాళ్ళ గురించి బాధపడుతూనే చెప్పింది, "శంభు, శివ అన్నల్లో చేరిపోయారనీ,

తర్వాత ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని, నాయక్ కోవర్టు అని అన్నలే నాలుగు రోడ్ల కూడలిలో అందరూ చూస్తుండగానే ఉరి తీశార"ని చెప్పింది. "లింగ గురించి ఎవరికీ ఏమీ తెలియదు. చనిపోయి ఉంటాడేమో, బతికుంటే కనీసం ఒకసారయినా వచ్చి ఉండేవాడు కదా? నువ్విక్కడ నుండి వెళ్ళిపోవడం మంచిదయిందని చాలాసార్లు అనుకున్నాను" ఇలా చెప్పుకుంటూ పోతోంది.

వింటున్నాను కాని నా ధ్యాసంతా రాజరత్నం, సరోజిని మీదే ఉంది. వాళ్ళిద్దరి గురించి తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది. ఆ ఊరు రావడానికి ముఖ్యమైన కారణం వాళ్ళిద్దరే! హైదరాబాద్‌లో ఉన్నా ఆ దంపతులు నాకు గుర్తురాని రోజు లేదు. నేను మా ఊరొదిలి బయల్దేరినప్పుడు సరోజిని సెంటరుకు వచ్చింది. తోడుగా రాజరత్నం రాలేదు. అప్పట్లో మా ఊరుకు ఎర్రబస్సులు వచ్చేవి కావు. ప్రైవేటు డొక్కు బస్సులే తిరుగుతుండేవి. బస్సు కదిలేవరకు నా పక్కన కూర్చుని, "వెంటనే తిరిగి వచ్చేస్తావు కదూ?" అడిగింది. తలూపాను. "రాకుంటే నేను చచ్చిపోయినంత ఒట్టు" అంది. ఆమె చేతిలో చేయి వేశాను. ఆమె కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. బస్సు కదలబోతుండగా తను దిగుతూ నా చేతిలో ఓ ఒక కాయితం పెట్టి, "ఈ ఇంటికి వెళ్ళు. వాళ్ళు ఎలా ఉన్నారో తెలుసుకుని నాకు ఉత్తరం రాయకు, అడ్రసు లేని దాన్ని. నువ్వు వచ్చాక నాతోనే చెప్పు, రాజరత్నం ముందు చెప్పొద్దు" అంది. తలూపాను. ఆమె బస్సు దిగిపోయింది. బస్సు రోడ్డు మలుపు తిరిగేవరకు సెంటర్‌లో నిలబడి నా వంక చూస్తూ చేయి ఊపుతూనే ఉంది.

తాలూకా సెంటరులో హైదరాబాద్ బస్సు ఎక్కినప్పుడు కూడ ఆమె నాకు ఇచ్చిన కాయితం భద్రంగా ఉంది. మధ్యలో ఒకసారి విప్పి చూశాను. ఎవరిదో చిరునామా. హైదరాబాద్ వచ్చాక చూసుకుంటే కనబడలేదు. ఎక్కడో పోగొట్టుకున్నాను.

రాజరత్నం, సరోజిని అంటే దొడ్డమ్మకు అయిష్టంగా ఉండేది. వాళ్ళగురించి వినడానికే అసహ్యపడేది. కారణం తెలుసుకోవడానికి ప్రయత్నించాను. కాని తెలుసుకోలేకపోయాను. "వాళ్ళింటికి వెళ్ళావంటే కాళ్ళు విరగకొడతాను" అనేది దొడ్డమ్మ. వెళ్ళకుండా ఉండలేకపోయేవాడిని. ప్రతిరోజూ నేను, నా నలుగురు స్నేహితులం సాయంత్రం అవుతుండేసరికి రాజరత్నం ఇంటికి వెళ్తుండేవాళ్ళం.

రాజరత్నంకు ముప్పయి అయిదేళ్ళుండేవి. చామనచాయలో బలంగా

ఉండేవాడు. మా అందరినీ ఒకేసారి ఎత్తుకుని గిరగిరా తిప్పేవాడు. సరోజిని కూడా అతని చుట్టూ చేతులు వేసి గట్టిగా పట్టుకుని తాను తిరుగుతుండేది. సరోజినికి ఇరవై అయిదు సంవత్సరాలుండేవి. చూడటానికి అంతకంటే చిన్న వయస్కురాలిలా ఉండేది. చీకటి పడేవరకు అందరం ఎన్నో ఆటలు ఆడుకునేవాళ్ళం. ఆటలాడడం అయిపోయాక కాలవలో ఈతలు కొట్టేవాళ్ళం. నాకు ఈత నేర్పించింది ఆమే.

వాళ్ళిల్లు ఊరికి చాలా దూరంలో ఉండేది. గుబురు చెట్ల మధ్య మట్టిగోడల మీద రేకులు వేసి ఉండేది. రెండు గదుల ఇంటి పక్కనే కాలవ పారుతుండేది. ఇంట్లో సామాన్లు కూడా ఎక్కువ ఉండేవి కావు. ఆమె మెడలో తాళిబొట్టు తాడు నేను ఎప్పుడూ చూడలేదు. చేతికి మామూలు గాజులు ఉండేవి. కుడిచేతి ఉంగరపు వేలికి తెల్లరాయి బంగారపు ఉంగరం ఉండేది. కాలివేళ్ళకు మెట్టెలుండేవి. కాళ్ళకు గజ్జెలున్న వెండి పట్టాలుండేవి. ఆమె ఒక ఎత్తు, ఆమె నడక ఒక ఎత్తు. చాలా హుందాగా నడిచేది. మనిషి కూడా సన్నగా ఎర్రగా ఉండేది. చక్కటి మనిషి. మాకు వాళ్ళతో ఎలా పరిచయం అయిందో మాకు గుర్తులేదు. మొదట్లో మేమంటే సిగ్గుపడి జరిగి దూరంగా కూర్చునేవాళ్ళు కాని తర్వాత ఆమె అతని పక్కమించి లేచేది కాదు. చీరమటుకు కాళ్ళవరకు లాక్కునేది. అతనికి అతుక్కునే పడుకునేది.

రాజరత్నం కాని, ఆమె కాని ఊళ్ళోకి ఎప్పుడూ వచ్చేవాళ్ళు కాదు. వాళ్ళకు ఏం కావలసి వచ్చినా మాలో ఎవరో ఒకరం ఊళ్ళోకి వెళ్ళి తీసుకువచ్చేవాళ్ళం. ఆమె పాయకూరంటే చాలా ఇష్టపడేది. మా ఇంట్లో ఎప్పుడు చేసినా నేను తినకుండా టిఫిన్ బాక్సులో పెట్టుకుని దొడ్డమ్మకు తెలియకుండా తీసుకెళ్ళి సరోజినికి ఇస్తూండేవాడిని.

రాజరత్నం ఉద్యోగం ఏం చేసేవాడు కాదు. అతని దగ్గర పొడుగాటి తుపాకి ఉండేది. తూటాలు కూడా చాలా ఉండేవి. వారానికి ఒకసారి ముఖ్యంగా శనివారం రాత్రిళ్ళు జీవా అనే అతనితో కలిసి అడవిలోకి వెళ్ళి అడవి పందిని వేటాడి అంతా అడవిలోనే శుభ్రం చేసి కుప్పలు చేసి ఆదివారం ఉదయానికల్లా మార్కెట్‌లో జీవాచేతా అమ్మించేవాడు. గంటలోపలే అమ్ముడయిపోయేవి. డబ్బు బాగా వచ్చేది. కొంత జీవాకిచ్చేవాడు. జీవాను ఒకటీ రెండుసార్లు మటుకు చూశాను. నాకే కాదు, సరోజినికి కూడా జీవా గురించి తెలియదు. రాజరత్నం వేటకు వెళ్ళివచ్చిన రోజంతా సరోజిని రాజారత్నాన్ని ఛండాలంగా తిడుతుండేది. అతను తనని ముట్టుకోనిచ్చేది

కాదు. "దూరంగా ఉండరా సువ్వర్" అని పొడుగాటి కత్తి ఎత్తి, "నన్ను ముట్టుకుంటే చంపి కుప్పలు వేస్తాను" అంటూ కోపంతో ఊగిపోయేది. ఇంత జరిగినా ఆ సాయంత్రానికి ఒకటయిపోయేవారు.

నాకు అక్కడ నచ్చిన మరొక విషయం ఏమిటంటే, కొండపక్కనే కాలవ ఉండటాన ఎండాకాలంలో కూడా నీళ్ళు నిండుగా పారుతుండేవి. రాళ్ళ ముక్కలను కోపంగా నీటిమీదకు విసిరితే తేలుతూ ఎదుటి రాళ్ళ గోడకు కొట్టుకునే చప్పుడుకు ఒడ్డుమీదున్న కప్పలు ఒకదానివెంట ఒకటి దూకేవి. చాలా శబ్దమయ్యేది. ఈ శబ్దానికి చుట్టుప్రక్కల ఉన్న గుబురు చెట్లలోంచి పక్షులు గోలగోలగా పైకి ఎగిరేవి. సద్దుమణగడానికి అరగంట పైగానే పట్టేది. అది పగటిపూటకన్నా రాత్రుళ్ళు బావుండేది. ఎక్కడ నీళ్ళు చూసినా ఆ దృశ్యం గుర్తుకువచ్చేది.

దొడ్డమ్మ అరుగు మీద నాకోసం మంచం పరుపు వేసి దుప్పటికప్పుతూ, "రాజరత్నం చనిపోయాడు తెలుసా?" అంది.

ఉలిక్కిపడ్డాను. మనసు అదోలా అయిపోతోంటే, "ఎప్పుడు"? బాధతో అడిగాను.

"నువ్వెళ్ళిన సంవత్సరానికనుకుంటాను. పోలీసులే చంపారో, అన్నలే పొట్టన పెట్టుకున్నారో తెలియదు. అసలతను సిపాయి, సైన్యంలో పనిచేస్తూ పారిపోయి వచ్చాడట."

ఆగలేక, "ఇప్పుడు సరోజిని ఎక్కడుంది?" ఆతృతగా అడిగాను.

"ఇంకెక్కడి సరోజిని? రాజరత్నం చనిపోయిన సాయంత్రం సుండే కనబడకుండా పోయింది. వాళ్ళూరు హైదరాబాదు. వాళ్ళూరు తిరిగి వెళ్ళిపోయిందో ఏమో తెలిదు. నిజాలు చాలా మందికి తెలిసినా ఎవరూ నోరు విప్పరు.

"మొదట్లో వాళ్ళంటే నాకు ఇష్టం లేకపోయినా తర్వాత్తర్వాత వాళ్ళు మంచివాళ్ళని తెలిశాక వెళ్ళి నేను పలకరించాను. మూడు నాలుగుసార్లు మనింటికి భోజనానికి పిలిచాను. వచ్చారు. ఆ పిల్లకు 'పాయ'కూరంటే చాలా ఇష్టం. వచ్చిన ప్రతిసారీ అదే చేసిపెట్టాను. ప్చ్, తలుచుకుంటే బాధ వేస్తుంటుంది" అని దొడ్డమ్మ లోపలకు వెళ్ళబోతూ ఆగి, "నీకు ఒక సంగతి తెలుసో, లేదో వాళ్ళిద్దరు ఇంట్లోంచి లేచివచ్చి ఇక్కడ తల దాచుకున్నారు, పెళ్ళీ పెటాకులు కాకుండా. ఇంకో విషయం,

ఆ పిల్లకు అంతకుముందే పెళ్ళి అయింది. ఆ పిల్ల పేరు సరోజిని కాదు... మనవాళ్ళు కూడా కాదు..." దొడ్డమ్మ ఇంట్లోకి వెళ్ళి తలుపు వేసుకుంది నా ప్రశ్నలు నాకు వదిలేసి.

తల పట్టుకు కూర్చున్నాను. వాళ్ళు భార్యభర్తలు కాదని వాళ్ళు పరిచయం అయిన కొత్తలో శంభూ నాతో అన్నప్పుడు నాకు నమ్మబుద్ధి కాలేదు. నా స్నేహితులంతా రాజరత్నం పక్కన ఉంటే సరోజిని నా పక్కన నిలబడి నన్ను దగ్గరకు తీసుకుంటూ, "నువ్వు నా వాడివిరా" అంటూ రాజరత్నం చూస్తుండగానే చాలాసార్లు ముద్దులుపెట్టుకుంది. మంచం మీద పడుకోబుద్ధి కాలేదు. వాళ్ళను తలుచుకునేకొద్దీ దుఃఖం ఆపుకోలేకపోతున్నాను.

లేచి బయటకు వచ్చాను. వెన్నెల వెలుగులో నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్ళాను. ఊరు పెద్దదయింది. స్కూలు భవనం పెచ్చులూడిపోయి పెద్ద గాలి వస్తే పడిపోయేట్లుగా ఉంది. స్కూలు దాటాక అంతా పర్రే. అక్కడినుండి రాజరత్నం ఉండిన ఇల్లు అడ్డదారిలో పావుగంట ప్రయాణం. అలవాటయిన దారి అవటాన కష్టం అనిపించడంలేదు. కాకపోతే చెట్లు మునుపటికన్నా గుబురుగా పెరిగాయి.

పాడుబడిపోయిన ఇంట్లోకి నడిచాను. మొండిగోడలు తప్ప ఏం మిగలలేదు. ఇంటి పై రేకులు మడతలు పడి. ఇంట్లో పడి ఉన్నాయి. ఒకానొక సమయంలో మా కేరింతలతో ఎంత ఆనందంగా ఉండేదా ఇల్లు? ఎటువెళ్ళిపోయిందా సందడి? గోడకు ఆనుకుని బాధతో అలా నుంచుండిపోయాను. సరోజినిని కూడా చంపేసి ఉంటారా? లేక అడవిలోకి పారిపోయి ఏ తాండాలోనన్నా తలదాచుకుని ఉందా? మంచి జీవితం కోసం వెతుక్కుంటూ వచ్చి తన్ను తాను పోగొట్టుకుంది.

పావుగంటేమో అలా నుంచుండిపోయాను. వాళ్ళగురించి ఆలోచించే కొద్దీ నన్ను నేను సంభాళించుకోలేకపోతున్నాను. ఇంటి బయటకు వచ్చి నాలుగయిదు పెంకురాళ్ళు తీసుకుని గట్టుమీద నుంచుని కాలవలోకి విసిరాను. నీళ్ళ అంచున ఉన్న కప్పలు నీళ్ళలోకి దూకుతున్న శబ్దానికి చెట్లమీద పక్షులు ఎగురుతూ అరవసాగాయి. సరోజిని ఉండి ఉంటే చిన్నపిల్లలా ఎగురుతూ చప్పట్లు కొడుతుండేది. ఇప్పుడు ఎక్కడుందో? పక్షుల అరుపులు సద్దుమణిగే వరకు ఉండి. కదలలేక కదలలేక అక్కడినుండి బయల్దేరి ఇంటికి తిరిగి వచ్చేసరికి వెన్నెల

ఆకాశమంతా నిండిపోయి ఉంది.

తొట్టెలోంచి నీళ్ళు తోడుకుని కాళ్ళూ, చేతులూ, ముఖం కడుక్కుని మంచం మీద కూర్చుని తువ్వాలుతో తుడుచుకుని పడుకున్నాను. చల్లగా వీస్తున్న గాలికి నిద్రపడుతోంది కాని కళ్ళ వెంట నీరు కారటం తగ్గడం లేదు.

నిద్ర అలా పట్టిందో లేదో, నా కన్నీళ్ళు చల్లటి చేత్తో ఎవరో తుడుస్తున్నట్లు అనిపించింది. ఎన్ని సంవత్సరాలయినా ఆ స్పర్శను గుర్తించగలను. చటుక్కున కళ్ళు తెరిచాను. సరోజిని మంచం మీద నాకు ఆనుకుని కూర్చుని ఉంది. అదే అందమైన నవ్వు ముఖం. నా ఆశ్చర్యం వెన్నెలంత అయింది. మాట్లాడవద్దన్నట్టు నా పెదవుల మీద తన కుడిచేతి చూపుడువేలు ఆనించింది.

లేచి కూర్చోబోయాను. వీలు కానీయలేదు. “ఇన్నేళ్ళ తర్వాతరా నేను నీకు గుర్తు వచ్చింది?” అని ముందుకు వంగి నా నుదుటిమీద ముద్దు పెట్టుకుని నేను జవాబు చెప్పేలోపల మంచం దిగి వీధి గుమ్మం వైపు నడవసాగింది. లేచి కూర్చుని, “సరోజినీ మాట” అన్నాను. తను రావడం నాకు ఎంతో సంతోషంగా ఉంది.

వెనక్కి తిరగలేదు. కుడిచేయి మటుకు గాలిలో ఆడించింది కాని ఆగలేదు. హుందాగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

అరుగు దిగి పరుగెత్తుకుంటూ ప్రహరీ గోడ గుమ్మం దాటి రోడ్డు మీదకు వచ్చాను. రోడ్డు నిర్మానుష్యంగా ఉంది.

*‘నవ్య’ దీపావళి ప్రత్యేక సంచిక, 2011*